మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 136/ 09 శనివారం, డిసెంబర్ 2023 పేజీలు: 4/వెల రూ5/-

## అస్సాం నిజానికి మయన్మార్‌లో భాగం : సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్

న్యూఢిల్లీ,డిసెంబర్8(మరో ఉదయం):



అస్సాం నిజానికి మయన్మార్‌లో భాగమని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టుకు తెలిపారు. 1955 పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6 ఏ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈ నెల 5 నుంచి విచారణ ప్రారంభించింది. ప్రతివాదుల తరుపున వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, అస్సాంతో సహా ఈశాన్య రాష్ట్రాల్లో అక్రమ వలసలను గుర్తించడం చాలా కష్టమని తెలిపారు. అస్సాం వాస్తవానికి మయన్మార్‌లో ఒక భాగమని అన్నారు. 1824లో ఈ భూభాగాన్ని

మిగతా 2 లో

## బిజెపి కక్షసాధింపు చర్యలు మమతా బెనర్జీ

కోల్‌కతా,డిసెంబర్8(మరో ఉదయం):



డబ్బు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగారనే ఆరోపణలపై టీఎంసీ ఎంపీ మహువ మొయిత్రను లోక్‌సభ నుంచి బహిష్కరించడం పట్ల పశ్చిమ బెంగాల్ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ స్పందించారు. తమ పార్టీ సహచరి మహువ మొయిత్రపై వేటు వేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. బహిష్కృత ఎంపీకి పార్టీ బాసటగా నిలుస్తుందని భరోసా ఇచ్చిన దీదీ బీజేపీ కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. తమ పార్టీ ఎంపీని బహిష్కరించాలని ఎథిక్స్ కమిటీ నివేదిక ఇచ్చిన అనంతరం మహువ

మిగతా 2 లో

## ఒకేరోజు 9 మంది నవజాత శివువులు మృతి

కోల్‌కతా,డిసెంబర్8(మరో ఉదయం):

ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్క రోజే 9 మంది నవజాత శిశువులు మరణించారు. రెండేళ్ల వయసున్న చిన్నారి కూడా చనిపోయింది. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గత 24 గంటల్లో ముర్షిదాబాద్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో 9 మంది నవజాత శిశువులు మరణించారు. రెండేళ్ల చిన్నారి కూడా చనిపోవడం కలకలం రేపింది. అయితే పోషకాహార లోపం, పుట్టుకతో వచ్చే గుండె సంబంధ వ్యాధులు, తక్కువ బరువుతో పుట్టిన నవజాత శిశువులు చనిపోయినట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. కాగా, చాలా మంది శిశువులు 500 గ్రాములు లేదా 600 గ్రాముల తక్కువ బరువుతో పుట్టారని, వారంతా ఇతర ఆసుపత్రుల నుంచి చాలా ఆలస్యంగా ఇక్కడ అడ్మిట్ అయ్యారని మెడికల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ కమ్ వైస్ ప్రిన్సిపల్ అమిత్ కుమార్ దాహ్ తెలిపారు. ఈ నేపథ్యంలో అలాంటి శిశువులను కాపాడటం చాలా కష్టమని అన్నారు. అయితే ఒకే రోజు 9 మంది నవజాత శిశువుల మరణించడంపై దర్యాప్తు చేసేందుకు కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## ప్రారంభం

# మహాలక్ష్మి పథకం

- ఫీబస్ సర్వీసును ప్రారంభించనున్న సిఎం రేవంత్
- బస్సు సర్వీసుకు సంబంధించి మార్గదర్శకాలు విడుదల
- గుర్తింపు కార్డు చూపి ప్రయాణం చేయొచ్చన్న ఆర్టీసి ఎండి

2లో






# ఇంట్లో జారిపడ్డ మాజీ సీఎం కెసిఆర్

3లో

- హుటాహుటిన యశోదాకు తరలింపు
- తుంటి ఎముకు విరిగినట్లు గుర్తించిన వైద్యులు
- ఆపరేషన్ చేయాలని వైద్యుల నిర్ణయం
- కెసిఆర్ ఆరోగ్యంపై సిఎం రేవంత్ స్పందన
- పర్యవేక్షించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీకి ఆదేశం





## బాపట్ల, తిరుపతి జిల్లాల్లో సిఎం జగన్ పర్యటన

తిరుపతి,డిసెంబర్8(మరో ఉదయం):

సీఎం జగన్ తుపాను ప్రభావిత ప్రాంతాలైన తిరుపతి, బాపట్ల జిల్లాల్లో పర్యటించారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక హెలికాప్టర్ లో తిరుపతి జిల్లాకు చేరుకున్న ఆయన, అధికారులతో కలిసి వాకాడు మండలం విద్యానగర్ వెళ్లారు. అనంతరం బాలిరెడ్డి పాలెం వెళ్లి అక్కడ స్వర్ణముఖి నది కట్ట తెగిన ప్రాంతాలను పరిశీలించారు. అక్కడి బాధిత గ్రామస్థులు, రైతులతో మాట్లాడారు. పంట నష్టం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుపాను ప్రభావంపై ఫోటో ఎగ్జిబిషన్ ను సందర్శించారు. తర్వాత మురుప్రోలు వారిపాలెం, కర్లపాలెం, బుద్దాం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు నేరుగా మాట్లాడనున్నారు. అంతకు ముందు తిరుపతి జిల్లాలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ వ్యూ ద్వారా దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

## ఎపిలో ఓటర్ల అవకతవకలు

- నిబంధనల మేరకు మార్పులు చేర్పులు జరగడం లేదు
- కేంద్ర ఎన్నికల సంఘానికి చంద్రబాబు లేఖ

న్యూఢిల్లీ,డిసెంబర్8(మరో ఉదయం):

రాష్ట్రంలో ఓట్ల అవకతవకలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఈసీని చంద్రబాబు కోరారు. ఎలక్టోరల్ మాన్యువల్ 2023 ప్రకారం ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు జరగడం లేదని తెలిపారు. ఈ మేరకుఎన్నికల కమిషన్‌కు టీడీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరో లేఖ రాశారు. రాష్ట్రంలో నియోజకవర్గాల వారీగా నమోదైన దొంగ ఓట్ల వివరాలతో లేఖ రాసినట్లు చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాసిన లేఖను కేంద్ర ఎన్నికల సంఘానికి చంద్రబాబు పంపించారు. మాన్యువల్ ప్రకారం జనాభా పరమైన సారూప్య ఎంపికలు, ఫోటో గ్రాపిక్ సారూప్య ఎంపికలు పరిశీలించి డబుల్ ఎంట్రీలను తొలగించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో అనేక నియోజకవర్గాలలో ఇప్పటికీ డబుల్ ఎంట్రీలు ఉన్నాయని తెలుగుదేశం అధినేత స్పష్టం చేశారు. 'ఇంటింటి సర్వేలో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు గుర్తించిన మరణాల సమాచారం, రాష్ట్ర డేటా బేస్‌లోని బర్త్ అండ్ డెత్ రిజిస్ట్రార్ సమాచారం మేరకు ఈఆర్‌ఓలు మరణించిన వారి ఓట్లు తొలగించాలి. కానీ, దురదృష్టవ శాత్తు డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులో ఇప్పటికీ మరణించిన వారి ఓట్లు దర్శనమిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్ ? 1960 ప్రకారం ఓట్లను ఇంటి నంబర్ల ప్రకారం క్రమంగా ఉండేలా చూడాల్సి ఉన్నా... నేటికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అర్హత లేని వారికి ఫామ్ ? 6 ద్వారా ఆన్‌లైన్ లో ఇష్టానుసారంగా ఓట్లు నమోదు చేస్తున్నారు.అధికార పార్టీకి అనుకూలంగా ఇష్టానుసారం ప్రతిపక్షాల ఓట్లను తొలగిస్తున్నారు. వీటిపై తెదేపా లేవనెత్తిన అభ్యంతరాలపై నేటికి దృష్టి పెట్టలేదు. నేరుగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ ఫామ్-7 ధరఖాస్తులను స్వీకరించరాదు. ఓటుపై అభ్యంతరం లేవనెత్తి ఓట్లను తొలగించాలని కోరుతున్న వారు ఖచ్చితంగా ఆధారాలు చూపించాలి.కొన్ని నియోజకవర్గాలలో ఎటువంటి విచారణ చేయకుండా తెల్ల పేపర్‌పై పేర్లు రాసిస్తే ఓట్లను తొలగిస్తున్నారు.

## నేటి ఉదయం ప్రోటెం స్పీకర్గా అక్బరుద్దీన్ ప్రమాణం

- అక్బర్ ఉంటే ప్రమాణం చేసేది లేదన్న రాజాసింగ్
- ఉదయం పార్టీ ఎమ్మెల్యేలతో భేటీ కానున్న కిషన్ రెడ్డి

హైదరాబాద్,డిసెంబర్8(మరో ఉదయం):



తెలంగాణ కొత్త అసెంబ్లీ శనివారం ఉదయం 11 గంటలకు తెలంగాణ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీ తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికైన ఎమ్మెల్యేల చేత ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ప్రమాణస్వీకారం చేయించనున్నారు. స్పీకర్ ఎన్నిక వరకూ ప్రొటెం స్పీకర్ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నారు. ఉదయం 8:30 గంటలకు రాజ్‌భవన్‌లో ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ప్రమాణం చేయనున్నారు. అసెంబ్లీ వాయిదా తర్వాత అసెంబ్లీ ప్రాంగణం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం స్కీంను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం అక్కడి నుంచి నిమ్స్‌కు వెళ్లి ఆరోగ్యశ్రీ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. మహిళలకు ఉ చిత బస్సు ప్రయాణం, పది లక్షలతో ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం విదితమే. అక్కడి నుంచి నిమ్స్‌కు వెళ్లి ఆరోగ్యశ్రీ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇదిలావుంటే అక్బరుద్దీన్ ఉండగా తాము ప్రమాణం చేయమని గోషామహల్ బిజెపి ఎంపి రాజాసింగ్ ప్రకటించారు. ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అక్బరుద్దీన్ ఓవైసీ ప్రొటెం స్పీకర్‌గా ఉంటే ప్రమాణస్వీకారం చేసేది లేదని తేల్చిచెప్పారు. రజాకార్ల వారుసులైన ఎంఐఎం నేత సమక్షంలో ఓథ్ తీసుకునే ప్రసక్తే లేదని చెబుతున్నారు. 2018లో కూడా ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం ఎమ్మెల్యే ముంతాజ్ ఖాన్ ఉన్నందున ప్రమాణం చేయలేదని... ఈసారి కూడా అదే నిర్ణయం ఉ ంటుందని రాజాసింగ్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం బీజెఎల్పీ బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ జరుగనుంది. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. అలాగే ప్రమాణ స్వీకారంపై రాజాసింగ్ వ్యాఖ్యల నేపథ్యంలో మిగతా 7 మంది ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకున్నాక కిషన్‌రెడ్డి విధానపరమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## లోక్‌సభకు రేవంత్ రెడ్డి రాజీనామా

### స్పీకర్ ఓంబిర్లాను కలిసి లేఖ అందచేత

న్యూఢిల్లీ,డిసెంబర్8(మరో ఉదయం):

సిఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి మల్కాజిగిరి లోక్‌సభ సీటుకు రాజీనామా చేశారు. స్పీకర్ ఓం బిర్లాతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. లోక్‌సభ సభ్యత్వానికి రేవంత్ రెడ్డి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని స్పీకర్ ఓం బిర్లాకు రేవంత్ రెడ్డి సమర్పించారు. స్పీకర్‌తో రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ వ్యవహారాల మాజీ ఇన్‌ఛార్జ్ మణిక్యం ఠాకూర్ సమావేశమయ్యారు. స్పీకర్‌తో భేటీ అనంతరం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తిరిగి హైదరాబాద్ బయలుదేరారు.



## ఉత్తరాది గోముద్రకు సంకేతం

### ఉత్తర,దక్షణం అంటూ విభేదాలు సరికాదు

### సెంథిల్ వ్యాఖ్యలను పరోక్షంగా తిప్పికొట్టిన తమిళసై

అహ్మదాబాద్,డిసెంబర్8(మరో ఉదయం):



ఉత్తరాది రాష్ట్రాలు గోముద్రకు సంకేతమని, గోమూత్రానికి కాదు అని తెలంగాణ గవర్నర్ తమిళసై సౌందరరాజన్ అన్నారు. అహ్మదాబాద్‌లోని గుజరాత్ యూనివర్సిటీలో జరిగిన కల్చరల్ ఎకానమీ కాన్‌క్లేవ్‌లో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల లోక్‌సభలో డీఎంకే ఎంపీ సెంథిల్‌కుమార్ మాట్లాడుతూ ఉత్తరాది రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలంటూ కామెంట్ చేసిన విషయం తెలిసిందే. గోమూత్ర రాష్ట్రాల్లోనే బీజేపీ గెలిచినట్లు ఆయన ఆరోపించారు. ఎంపీ సెంథిల్ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని గవర్నర్ తమిళసై అన్నారు. తాను తమిళనాడుకు చెందిన వ్యక్తిని అని, కొందరు ఉత్తర-దక్షిణ రాష్ట్రాల మధ్య వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, తమిళనాడుకు చెందిన ఓ ఎంపీ ఆ వ్యాఖ్యలు చేయడం బాధ కలిగించినట్లు ఆమె పేర్కొన్నారు.

మిగతా 2 లో

## ప్రజాభవన్ వద్ద సందర్శకుల సందడి

### శిలాఫలకంపై కెసిఆర్ పేరు కనిపించకుండా పేడ

### సెల్ఫీలు దిగుతూ రచ్చ

హైదరాబాద్,డిసెంబర్8(మరో ఉదయం):

తెలంగాణ సీఎం అధికారిక నివాసంలో ప్రజాభవన్ వద్ద ఆసక్తికరమైన దృశ్యాలు కనిపించాయి. ప్రగతి భవన్ ప్రారంభోత్సవం టైంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం ఎదుట సందర్శకులు సెల్ఫీలు తీసుకుంటున్నారు. అయితే అందులో కేసీఆర్ పేర్‌పై మట్టి పూసి ఉండటాన్ని హైలైట్ చేస్తూ సందర్శకులు సెల్ఫీలు దిగారు. ఇలాంటి ఫొటోలు కాస్త వైరల్‌గా మారుతున్నాయి.ప్రగతి భవనాన్ని ప్రారంభించింది కేసీఆర్ అని రాసి ఉన్న శిలాఫకలం ప్రజాభవన్ ఎంట్రెన్స్‌లో ఉంది. అందులో కే చంద్రశేఖర్‌రావు అని రాసి ఉన్న పదానికి కొందరు కాంగ్రెస్ లీడర్లు మట్టి పూత పూశారు.



SAT - M U_SAT - M U.qxd 09-12-2023 07:04 AM Page 2



మార్పు కోసం ...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## ఇండియా కూటమిలో అప్పుడే లుకలుకలు

మూడు రాష్ట్రాల్లో ఓటమితో కాంగ్రెస్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఇండియా కూటమిలో లుకలుకలు బయటపడ్డాయి. కాంగ్రెస్‌ను నమ్మేందుకు ఇతర పార్టీలు సిద్దంగా లేవు. ఇది ఓ రకంగా ఇండియా కూటమి మనుగడను సవాల్ చేసేదిలా ఉంది. అందుకే ఢిల్లీలో జరగాల్సిన కూటమి భేటీ వాయిదా పడింది. మమతా బెనర్జీ, నితీశ్ కుమార్ లాంటి వారు హాజరు కాబోమని తేల్చి చెప్పారు. త్వరలో పార్లమెంట్‌కు ఎన్నికలు జరుగబోతున్న తరుణంలో ఇది కాంగ్రెస్‌కు శరీఘాతంగా చూడాలి. ఎన్నికల ముందున్న ఉత్సాహం ఇప్పుడు ఫలితాల తరవాత కానరావడం లేదు. ఆమ్ ఆద్మీకి కూడా గట్టి దెబ్బ తగిలింది. తాము కోల్పోయిన ఓబీసీ, దళిత, ఆదివాసీ, మైనారిటీ ఓటు బ్యాంకును తిరిగి పొందేందుకు కాంగ్రెస్ చేసిన ఎత్తుగడ ఫలించలేదు. మూడు ఉత్తరాది రాష్ట్రాల్లో కులగణన అంశం తెరపైకి తెచ్చినా.. ఫలించలేదు. దేశాన్ని ఏకం చేసే విషయాలను వదిలి విచ్ఛిన్నం చేసే కులగణనపై బిజెపి గట్టిగానే ఎదరించింది. కులాలు వద్దంటూనే కులగణన తేవాలన్న ఆలోచనలపై ప్రధాని మోడీ గట్టిగానే వ్యతిరేకిం చారు. సమాజంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని విమర్శలు గుప్పించారు. మూడు రాష్ట్రాలతో పాటు తెలంగాణ ఫలితాలను విశ్లేషిస్తే.. ఉత్తరాదిలో బిజెపిని ప్రజలు ఆదరించారు. ఇది ఓరకంగా మోడీకి విజయంగానే భావించాలి. తెలంగాణ ఎన్నికలు కేవలం కెసిఆర్ అహంభావంపై తిరుగుబాటుగా చూడాలి. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు ప్రజలను పట్టించుకోలేదు. ఎన్నికలయ్యాక బస్సుల్లో జనాలను ఫామ్‌హౌజ్‌కు పిలిపించి మాట్లాడడం కెసిఆర్ నైజం తెలిసిపోయింది. అధికారంలో ఉంటే కలవకపోవడం.. లేకుంటే రా రమ్మని పిలవడం ప్రజలు గమనించారు. మొత్తంగా దేశంలో బిజెపికి ఆదరణ పెరుగుతోందని అర్థం అయ్యింది. తెలంగాణలో కూడా బిజెపి బిఆర్‌ఎస్‌తో లోపాయకారిగా ఒప్పందం చేసుకుని భంగపడింది. లేకుంటే ఇక్కడ పరిస్థితి మరోలా ఉండేది. అయితే తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రజలకు చేరువయ్యేలా చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలు ఇవ్వవచ్చు. ఇకపోతే దేశంలో కులగణనను విడిచి పెట్టి అభివృద్ధి, వెనకబాటు తనంపై పార్టీలు పోరాడాలి. కలుగణన అంశాన్ని ఆధారంగా అందలం ఎక్కాలని చూసే పార్టీలకు భంగపాటు తప్పదని ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఫలితాలు తేల్చాయి. బిహార్‌లో కులాల ఆధారంగా జరిగిన సర్వే ప్రకటించిన తర్వాత దేశంలో కాంగ్రెస్‌కు ఒక బలమైన సైద్ధాంతిక భూమిక లభించింది. మోదీ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును మోదీ ఆమోదింపజేశాక, మహిళా ఓటు బ్యాంక్ దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. ఈ క్రమంలో ప్రతిపక్షాలు తమ వ్యూహాన్ని మరింత పటిష్ఠం చేసుకునే అవకాశాన్ని కులగణన ద్వారా పొందాలని చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో దీనిని జాతీయ ఎజెండా చేయాలని ప్రయత్నించి భంగపడ్డాయి. హిందూత్వ ప్రభావ పరిధిలోంచి ఆయా కులాలు బయటపడకుండే చూడాలన్నది మోదీ నాయకత్వంలోని బీజేపీ లక్ష్యంగా ఉంది. కులగణన ద్వారా హిందువులు విభజనకు గురికాకుండా ఐక్యం చేయాలన్నది మోడీ ఆలోచన. దానిని గండికొట్టి లబ్ధిపొందాన్నది కాంగ్రెస్ ఎజెండా. అయితే కులాల అస్తిత్వాన్ని, వాటికి లభిస్తున్న అవకాశాలను ఒక చర్చనీయాంశంగా మార్చి తమకు అనుకూలంగా మార్పు చేసేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ప్రయత్ని స్తున్నాయి. ఒక రకంగా ప్రతిపక్షాల ఎజెండా బీజేపీ హిందూత్వ వాదానికి ఒక సవాల్ లాంటిదనే చెప్పాలి. కాంగ్రెస్ విషయానికి వస్తే కర్ణాటక ఎన్నికల్లోనే సామాజిక న్యాయాన్ని తన అస్త్రంగా ఉపయోగించుకుంది. అదే అస్త్రాన్ని ఇప్పుడు జాతీయ స్థాయిలో ఉపయోగించుకునేందుకు వ్యూహరచన చేస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నాటికి దీనిని పెద్ద ఎజెండా తీసుకుని వెళ్ళడం ద్వారా చేస్తున్న ప్రయత్నాలు కాంగ్రెస్ లేదా ఇతర పార్టీలకు లాభించకపోవచ్చు. కులజనగణన నిర్వహించాలని కాంగ్రెస్ తాజాగా డిమాండ్ చేయడం అందు లో భాగమే. మహిళా రిజర్వేషన్‌లోనూ ఓబీసీలకు సైతం కోటా కావాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. జనాభాకు తగ్గట్లుగా ఆయా వర్గాలకు హక్కులు లభించాలని డిమాండ్ తెరపైకి తేవడంలో కాంగ్రెస్ ఓటుబ్యాంక్ రాజకీయం దాగివుంది. ఒక్క మధ్యప్రదేశ్‌లోనే 45 శాతం ఓబీసీలు ఉన్నారు. ఆ రాష్ట్రంలో కమల్‌నాథ్ 15 నెలల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఓబీసీ కోటాను 14 నుంచి 27 శాతానికి పెంచారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి రెండు రోజుల ముందే రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ తన రాష్ట్రంలో కూడా కుల జనగణన జరిపిస్తానని ప్రకటించారు. ఓ సర్వే ప్రకారం రాజస్థాన్‌లో కూడా 35 నుంచి 40 శాతం ఓబీసీలు ఉన్నారు. ఈ వర్గాలు అధికంగా ఉన్న రాజస్థాన్, ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణలో కాంగ్రెస్‌కు సానుకూల ఫలితాలు లభిస్తాయని, అది జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పూర్వవైభవానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ భావించింది. గతంలో మండల్ కమిషన్‌ను సమర్థించిన పార్టీలన్నీ ఇప్పుడు 'ఇండియా' కూటమిలో ఉండడం ద్వారా కులగణనకు డిమాండ్‌ను బలంగా తీసుకుని వచ్చింది. అయితే ఈ మూడు రాష్ట్రాల్లో ఈ అంశాన్ని ప్రజలు పెద్దగా ఆదరించలేదు. కులగణన ద్వారా లాభం లేదని ప్రజలు కూడా గమనించారు. నిజానికి ఇప్పుడు బిజెపి గెలిచిన ఈ మూడ రాష్ట్రాలు గతంలో కాంగ్రెస్ గెలిచినవే. అయితే మధ్యప్రదేశ్‌లో మాత్రం బిజెపి ఎత్తులకు కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. మొత్తంగా కాంగ్రెస్ ఓటమితో ఇండియా కూటమి కూడా బలహీనపడినట్లుగానే భావించాలి. తెలంగాణలో గెలుపును అన్ని పార్టీలు కూడా కెసిఆర్‌పై వ్యతిరేక ఓటుగానే భావిస్తున్నాయి. అందుకే కాంగ్రెస్ ఓటమితే ఇండియా కూటమి ముందుకు సాగడం అనుమానంగానే ఉంది.

మొదటిపేజీ తరువాయి

# మహాలక్ష్మి పథకం

హైదరాబాద్,డిసెంబర్8 (మరో ఉదయం):

తొలిరోజే రేవంత్‌రెడ్డి సర్కార్ తన మార్కు పాలన చూపించారు. రెండో రోజు కూడా పలు కీలక అంశాలపై సమీక్ష చేపట్టారు. ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నిమిషాల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో రెండు పథకాలు అమలుకు శ్రీకారం చుట్టారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. రెండోది రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించింది. ఇందులో భాగంగానే శనివారం సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వయసుల మహిళలు, ట్రాన్స్‌జెండర్స్‌కి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సిటీ ఆర్డినరీ, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా నారీమణులు ప్రయాణం చేయొచ్చని పేర్కొంది. ఇక త్వరలో ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ ఆధారిత కార్డును ఆర్టీసీ యాజమాన్యం అందుబాటులోకి తేనుంది. అలాగే మహిళలకు సంబంధించిన చార్జీలను రీయింబర్స్ రూపంలో ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుంది. తెలంగాణ పరిధి వరకు శనివారం మధ్యాహ్నం నుంచి ఉచిత బస్సు ప్రయాణ అమల్లోకి రానుంది. అంతరాష్ట్ర బస్సులకు కూడా తెలంగాణ పరిధి వరకు ఉచితం కల్పించింది. మొదటి వారం రోజుల పాటు ఎలాంటి ఐడెంటీ కార్డులు లేకుండానే ప్రయాణం చేయొచ్చని సూచించింది. ఈ మేరకు టీఎస్‌ఆర్టీసీ ఎండీ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని శనివారం నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రకటించారు. అసెంబ్లీలో మధ్యాహ్నం 1:30 గంటలకు సీఎం రేవంత్ ఈ పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర నివాసిత మహిళలకే ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. స్థానికతకు ధ్రువీకరణకు గుర్తింపు కార్డు తప్పనిసరిగా చూపించాలన్నారు. బస్ భవన్‌లో సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. మహాలక్ష్మి పథకం అమలుకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం రేవంత్ రేపు మధ్యాహ్నం ఈ పథకాన్ని ప్రారంభిస్తారని, అందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం చరిత్రాత్మక నిర్ణయం అని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ ఇస్తారు. వయసుతో సంబంధం లేకుండా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించొచ్చు. ఈ పథకం వల్ల ప్రజా రవాణాకు మేలు జరుగుతుందని చెప్పారు. మహాలక్ష్మి పథకం అమలుతో ప్రజా రవాణా తిరిగి పుంజుకుంటుం దన్నారు. ఈ పథకం అమలుకు సంబంధించి ఇప్పటికే ఆర్టీసీ సిబ్బంది నిబంధనలు జారీ చేశామన్నారు. వారం రోజుల తర్వాత బస్సుల్లో ప్రయాణించే మహిళలు.. రాష్ట్రం, కేంద్రం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు చూపించాలన్నారు. మహిళలు బస్సు ఎక్కడైనా ఎక్కొచ్చు.. ఎక్కడైనా దిగొచ్చు. ఎన్నిసార్లు అయినా ప్రయాణించొచ్చు అని స్పష్టం చేశారు. ఉచిత ప్రయాణాలకు ఎలాంటి పరిమితులు, షరతులు లేవని తెలిపారు. మహిళల టికెట్ ఛార్జీల మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లిస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో 40 శాతం మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. ఇది 55 శాతం దాకా వెళ్లే అవకాశం ఉంది. భవిష్యత్‌లో మరిన్ని సర్వీసులు పెంచే అవకాశం ఉంది. రోజు వారి ఆదాయం రూ. 14 కోట్లు ఉంది. పథకం అమలైన తర్వాత ఆదాయం 50 శాతం తగ్గిపోతోంది. అంటే రూ. 7 కోట్ల దాకా వస్తుంది. రీయింబర్స్‌మెంట్ ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. రాబోయే రోజుల్లో 1,050 కొత్త బస్సులు రాబోతున్నాయి. వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు తీసుకుంటున్నామని, అందులో 500 సిటీకి, 500 రూరల్ ఏరియాకు వస్తాయని సజ్జనార్ స్పష్టం చేశారు.

మొదటిపేజీ తరువాయి

# ఉత్తరాది గోముద్రకు సంకేతం

ఉత్తరాది రాష్ట్రాలు పవిత్రకు సంకేతమైన గోముద్ర రాష్ట్రాలు అని, అవి గోమూత్ర రాష్ట్రాలు కాదు అని ఆమె అన్నారు. ఇలాంటి విభజన ఉండవద్దు అన్నారు. పురాతన కాలంలో తమిళ ప్రజలు తమ ఇండ్లల్లో దేవుడి ముందు హూండిని పెట్టుకుని దాంట్లో రోజు డబ్బులు వేసేవాళ్లు అని, జమ అయిన ఆ సొమ్ముతో కాశీ యాత్ర చేసేవాళ్లు అని గవర్నర్ తమిళిసై తెలిపారు. దేశ ప్రజలు ఆధ్మాత్మికంగా ఒక్కటై ఉన్నారని, కానీ ప్రాంతీయంగా వాళ్లను వేరు చేయడం సరికాదు అని అన్నారు. ప్రజల్ని ఎలా విభజిస్తారని, ఆధ్యాత్మికంగా ఒక్కటయ్యారని, రాజకీయంగా కొందరు విభజన చేసే ప్రయత్నం చేస్తున్నారని, కానీ వాళ్ల ప్రయత్నాలు ఏమీ ఫలించవని, ఎందుకంటే అందరూ ఆధ్యాత్మికంగా ఒక్కటై ఉన్నట్లు ఆమె తెలిపారు. తమిళనాడులో కాశీ, రామేశ్వరంను ప్రజలు వేరువేరుగా చూడరని, కాశీ వెళ్లిన వారు రామేశ్వరం వెళ్తారని, అలాగే రామేశ్వరం వెళ్లిన వాళ్లు.. కాశీకి ఆధ్యాత్మిక టూర్ చేస్తారని గవర్నర్ తమిళిసై అన్నారు. ఉత్తరాది-దక్షిణాది మధ్య అగాధాన్ని పెంచవద్దు అని, కాశీ పట్టణం ఉత్తరంలో ఉందని, తమిళనాడులో టెన్‌కాశీ ఉందన్నారు. మన సంస్కృతులు ఒక్కటి కావడం వల్ల.. మనల్ని ఎవరూ విడదీయలేరని ఆమె తెలిపారు. బలమైన సాంస్కృతిక వ్యవస్థ అవసరమని చెబుతూ.. గడిచిన 100 ఏండ్లలో దేశవ్యాప్తంగా సుమారు 20 వేల ఆలయాలు ధ్వంసం అయ్యాయని, ఇప్పుడు అలాంటి ఆరాధ్య కేంద్రాలను డెవలప్ చేస్తున్నట్లు చెప్పారు. గుజరాత్‌లోని పావగడ్ కొండల్లో ఉన్న శ్రీ కాళికామాత ఆలయాన్ని ఇటీవల పునర్ నిర్మించినట్లు ఆమె తెలిపారు. ఆలయాల పునర్ నిర్మాణం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. ఆలయాన్ని ఓసారి రెనోవేట్ చేస్తే, అప్పుడు అక్కడికి భక్తులు వస్తారని, ఆలయాల పునర్ నిర్మాణంపై దృష్టి పెట్టాలని, కాళీమాత ఆలయాన్ని పునర్ నిర్మించడానికి ముందు రోజూ 5వేల మంది భక్తులు అక్కడికి వచ్చేవారని, ఇప్పుడు ప్రతి రోజూ 80 వేల మంది వస్తున్నట్లు ఆమె తెలిపారు. కిసాన్ కార్డుల తరహాలో యాత్రకుల కార్డులు ఇవ్వాలని, దాని వల్ల హోటళ్లలో లేదా పూజా ప్రదేశాల్లో ప్రిఫరెన్స్ వచ్చేలా చూడాలన్నారు.

మొదటిపేజీ తరువాయి

# అస్సాం నిజానికి మయన్మార్‌లో భాగం : సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్

బ్రిటీష్ స్వాధీనం చేసుకుందని, ఒక ఒప్పందం ద్వారా అస్సాంను బ్రిటీష్ వారికి అప్పగించారని చెప్పారు. ఆ తర్వాత జరిగిన బెంగాల్ విభజనకు ముందు ఈస్ట్ బెంగాల్ (బంగ్లాదేశ్) ప్రాంతంతో ఈ భూభాగానికి సంబంధం ఉండేదని చారిత్రక ఆధారాలతో వెల్లడించారు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారుల ప్రవేశాన్ని పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6 ఏ ద్వారా చట్టబద్ధం చేసినట్లు వివరించారు. కాగా, అస్సాం ఒప్పందం అమలులో భాగంగా 1966 జనవరి 1 నుంచి 1971 మార్చి 25 మధ్య అస్సాంలోకి ప్రవేశించిన నిర్దిష్ట విదేశీ వలసదారులు భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి సెక్షన్ 6 ఏ ద్వారా అనుమతించారని కపిల్ సిబల్ తెలిపారు. దీంతో అస్సాం రాష్ట్ర జనాభా, సంస్కృతిని ఇది బాగా ప్రభావితం చేసిందన్నారు. 'ప్రజలు, జనాభా వలసల గురించి చరిత్రలో ఉంది. అయితే ఎక్కడి నుంచి వలస వచ్చారో అన్నది మ్యాప్ చేయలేదు. అస్సాం చరిత్రను పరిశీలిస్తే, ఎవరు ఎప్పుడు ఎక్కడి నుంచి వచ్చారో అన్నది గుర్తించడం అసాధ్యమన్నది మీరు (ధర్మాసనం) గ్రహించవచ్చు' అని సుప్రీంకోర్టుకు తెలిపారు. మరోవైపు సీజేఐ చంద్రచూడ్, న్యాయమూర్తులు ఏఎస్ బోపన్న, ఎంఎం సుందరేష్, ఏబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం, ఇరు వర్గాల వాదనలు విన్నది. 1971 మార్చి 25 తర్వాత అస్సాం, ఈశాన్య రాష్ట్రాల్లోకి అక్రమ వలసదారుల ప్రవేశంపై వివరణాత్మక డేటా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని గురువారం ఆదేశించింది. కాగా, అక్రమ వలసదారులుగా పేర్కొంటూ అస్సాంలోని వేలాది మంది ప్రజల పౌరసత్వాన్ని రద్దు చేశారు.దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. తాము భారత పౌరులమేనని నిరూపించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

మొదటిపేజీ తరువాయి

# బిజెపి కక్షసాధింపు చర్యలు మమతా బెనర్జీ

మొయిత్రకు సభలో మాట్లాడే అవకాశం కల్పించకపోవడం దారుణమని అన్నారు. వివరణ ఇచ్చేందుకు ఎంపీకి అవకాశం ఇవ్వకుండా ప్రజాస్వామ్యాన్ని హత్య చేసిన తీరును తాను ఖండిస్తున్నానని పేర్కొన్నారు. పార్టీ ఆమెకు పూర్తిగా అండగా ఉంటుందని, ఆమెకు న్యాయం జరగాలని తాము కోరుకున్నా ప్రభుత్వం ఎలాంటి అవకాశం ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఇది బీజేపీ కక్షసాధింపు రాజకీయాలకు అద్దం పడుతోందని దీదీ పేర్కొన్నారు. ఇది పార్లమెంట్ చరిత్రలో విషాదకర రోజని దీదీ అన్నారు. మొయిత్రను బహిష్కరిస్తూ లోక్‌సభ నిర్ణయం రాజ్యాంగ హక్కులకు తూట్లు పొడవడమేనని వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌లో తమకూ మూడింట రెండు వంతుల మెజారిటీ ఉందని, ఎవరినైనా తక్షణమే బహిష్కరించే అవకాశం ఉందని, కానీ తాము ఇలాగే చేయాలా అని ఆమె ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికలకు కేవలం రెండు, మూడు నెలల సమయం మాత్రమే ఉండగా ఇలాంటి ఘటన దురదృష్టకరమని, తాము అంగీకరించబోమని దీదీ స్పష్టం చేశారు.

# టీఎంసీ ఎంపీ మహువా మెయిత్రాపై బహిష్కరణ వేటు

న్యూఢిల్లీ,డిసెంబర్8(మరో ఉదయం):



డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారనే ఆరోపణలను ఎదుర్కొంటున్న టీఎంసీ ఎంపీ మహువా మెయిత్రా పై బహిష్కరణ వేటు పడింది. పార్లమెంటు నైతిక విలువల కమిటీ ఇచ్చిన నివేదికను లోక్‌సభ ఆమోదించింది. ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరించాలంటూ 500 పేజీల నివేదకలో ఎథిక్స్ కమిటీ సిఫారసు చేసింది. దీనిపై చర్చ జరిపిన అనంతరం ఓటింగ్ నిర్వహించారు. నివేదికను లోక్‌సభ ఆమోదించడంతో ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరిస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.నివేదికపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేతలు అధీర్ రంజన్ చౌదరి, మనీష్ తివారీ తదితరులు మహువా మొయిత్రీని మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అయితే అందుకు స్పీకర్ నిరాకరించారు. లోక్‌సభ నుంచి తనను బహిష్కరించడంపై మహువా మొయిత్రా పార్లమెంటు వెలుపల నిప్పులు చెరిగారు. బహిష్కరించే హక్కు ఎథిక్స్ కమిటీకి లేదని అన్నారు. ఇది మీ (బీజేపీ) ముగింపునకు ఆరంభం అంటూ ఘాటుగా విమర్శించారు.

# బిజెపి రాష్ట్రాల్లో సిఎంలపై సందిగ్ధత

## మూడు రాష్ట్రాలకు కమిటీలనునియమించిన బిజెపి

న్యూఢిల్లీ,డిసెంబర్8(మరో ఉదయం):



రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన క్రమంలో సిఎం ఎవరన్నదానిపై స్పష్టం రాలేదు. ఆయా రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులెవరనేదానిపై ఇంకా సందిగ్ధత వీడలేదు. ముఖ్యమంత్రి అభ్యర్థులు ఎక్కువగా పోటీలో ఉండటమే ఈ తర్జన భర్జనలకు కారణమని తెలుస్తోంది. ఈ సస్పెన్స్ కు తెరదించుతూ.. బీజేపీ శుక్రవారం కేంద్ర పరిశీలకులను నియమించింది. వీరు మూడు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రిగా ఎవర్ని ఉంచాలనే అంశంపై చర్చిస్తారు. రాజస్థాన్ పరిశీలకులుగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, వినోద్ తవాడే, సరోజ్ పాండేలను పార్టీ నియమించింది. మధ్యప్రదేశ్‌కు హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కె లక్ష్మణ్, ఆశ లక్రాలను నియమించింది. ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, సర్బానంద సోనోవాల్, దుష్యంత్ గౌతమ్‌లను పరిశీలకులుగా నియమించారు. పరిశీలకుల కమిటీ ముఖ్యమంత్రుల పేర్లను వారాంతంలో ప్రకటించే ఛాన్స్ ఉంది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల సమావేశాలను పర్యవేక్షించేందుకు పరిశీలకులు ఆయా రాష్ట్రాలకు వెళ్తారని.. అక్కడ కాబోయే ముఖ్యమంత్రి పేరు వెల్లడించే అవకాశం ఉందని ఓ బీజేపీ నేత తెలిపారు. సీఎం ఎంపికపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ముఖ్యమంత్రులను ఎన్నుకోవడంలో సామాజిక, ప్రాంతీయ, పాలన, సంస్థాగత ప్రయోజనాలను దృష్టి ఉంచుకుంటారని తెలిపారు.

# నిమమరైతులను ఆదుకోవాలి: సోమిరెడ్డి

నెల్లూరు,డిసెంబర్8(మరో ఉదయం):

నిమ్మ రైతులకు అపారంగా నష్టం వాటిల్లిందని వైసీపీ ప్రభుత్వం వెంటనే స్పందించాలని తెలుగుదేశం సీనియర్ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నాడు పొదలకూరు మండలం బిరుదవోలులో మిచౌంగ్ తుఫాన్ ప్రభావిత పంటలను పరిశీలించారు. రైతలను కలిసి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ... ఒక్క పొదలకురులోనే 10 వేల ఎకరాలు నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ మంత్రి 14 ఎకరాలు మాత్రమే నష్టం జరిగిందని చెప్పడం హాస్యస్పదంగా ఉంది. ఏపీ ముఖ్యమంత్రి , వ్యవసాయ శాఖ మంత్రి కార్లు దిగకుండా ఉంటే తుఫాన్ నష్టాన్ని ఎలా అంచనా వేస్తారు. వారి సమస్యలు ఎలా తెలుస్తాయి. వరదల్లో నష్టపోయిన వారిని కనీసం పరామర్శించాలని ఈ జిల్లా కలెక్టర్‌కి కూడా లేదా. పార్లపల్లి గ్రామంలో తుఫాన్ కారణనీగా గత నాలుగు రోజుల నుంచి కరెంటు లేక మంచినీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు' అని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

# సిఎం రేవంత్‌ను కలిసిని రాచకొండ కమిషనర్

## శుభాకాంక్షలు తెలిపిన టిఎన్జీవో నాయకులు

హైదరాబాద్,డిసెంబర్8(మరో ఉదయం):

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమితులైన రేవంత్ రెడ్డిని రాచకొండ పోలీస్ కమిషనర్ డిఎస్ చౌహాన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ సెక్రటేరియట్‌లో ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టిఎన్జీఓ రాష్ట్ర నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. సచివాలయంలో టిఎన్జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అధ్వర్యంలో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డా.ఎస్.ఎం.హుస్సేనీ (ముజీబ్), కేంద్ర సంఘ నాయకులు టి.పర్వతాలు కలిసి అభినందనలు తెలియజేశారు. సిఎంతో మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, జూపల్లి కృష్ణారావులను కలిసి వారు అభినందనలు తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని యావత్ తెలంగాణ ఎన్జీఓల సంఘం పక్షాన హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నట్టు వారు తెలిపారు.

SAT - M U_SAT - M U.qxd 09-12-2023 07:04 AM Page 3



# ఇంట్లో జారిపడ్డ మాజీ సీఎం కెసిఆర్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్,డిసెంబర్8

(మరో ఉదయం)

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అర్ధరాత్రి ఫామ్ హౌస్ బాత్ రూమ్‌లో జారి పడటంతో ఆయన తొంటికి తీవ్ర గాయమైంది. దీంతో కుటుంబసభ్యులు ఆయనను యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యశోదాలో కేసీఆర్‌కు చికిత్స కొనసాగుతోంది. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని, యశోదా ఆస్పత్రి వద్ద భద్రత పెంచాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వి యశోద హాస్పిటల్‌కు వెళ్లారు. యశోద ఆసుపత్రి వైద్యులను అడిగి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని హెల్త్ సెక్రటరీకి యశోద వైద్యులు తెలియజేశారు. కేసీఆర్‌కు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి తెలిసిన వెంటనే ప్రభుత్వం స్పందించిన విషయం తెలిసిందే. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్లియరెన్స్‌తో కేసీఆర్‌ను పోలీస్ అధికారులు ఆసుపత్రికి తరలించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై యశోద ఆస్పత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. కేసీఆర్ ఎడమ తుంటి ఎముక విరిగినట్లు తెలిపారు. ఆపరేషన్ చేసి తుంటి ఎముక రీప్లేస్ చేయనున్నట్లు చెప్పారు. కేసీఆర్ కోలుకునేందుకు 6 నుంచి 8 వారాలు పడుతుందని యశోద వైద్యులు బులెటిన్‌లో వెల్లడించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ అధినేత ఆరోగ్య పరిస్థితిని ఆస్పత్రిలోని వివిధ విభాగాల వైద్యులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆయనకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి యశోద ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గురువారం అర్ధరాత్రి ఆయన కాలు జారి కిందపడటంతో తీవ్ర గాయమైంది. వెంటనే ఆయనను సోమాజిగూడ యశోదా హాస్పిటల్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు కేసీఆర్ తుంటి ఎముక విరిగినట్లు గుర్తించారు. దీంతో ఐసీయూకి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, శుక్రవారం సాయంత్రం కేసీఆర్‌కు హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయనున్నారు. మరోవైపు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని మోదీ కూడా స్పందించిన విషయం తెలిసిందే. కేసీఆర్‌కు గాయమైన విషయం తెలియగానే చాలా బాధపడ్డట్లు ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని, మంచి ఆరోగ్యంతో ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్ ఆరోగ్యంపై ఎమ్మెల్సీ కవిత సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. కేసీఆర్‌కు స్వల్ప గాయమైందని, ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని చెప్పారు. ఆయన త్వరలోనే కోలుకుంటారని వెల్లడించారు. కేసీఆర్‌పై ప్రజల ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్‌కు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు యశోద ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేయనున్నారు. కేసీఆర్‌కు తొంటి ఎముక రెండు చోట్ల విరిగినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు ఆపరేష్ చేయాల్సి ఉంటుందని ఇప్పటికే వైద్యులు వెల్లడించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీకి సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి యశోద ఆస్పత్రికి వెళ్లారు. వైద్యులతో మాట్లాడి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. హెల్త్ బులెటిన్ విడుదల.. కేసీఆర్ హెల్త్ బులెటిన్‌ను యశోద ఆస్పత్రి వైద్యులు విడుదల చేశారు. కోలుకునేందుకు 6 నుంచి 8 వారాలు పడుతుందన్నారు. ప్రస్తుతం కేసీఆర్ వైద్యుల పరిరక్షణలో ఉన్నట్లు తెలిపారు. కాగా గురువారం రాత్రి ఫామ్ హౌస్ బాత్ రూమ్‌లో జారి పడ్డారు. దీంతో ఆయన తొంటికి తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు ఆయనను యశోద ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టరు.. తుంటి ఎముక రెండు చోట్ల విరిగినట్లు గుర్తించారు. ఈ రోజు ఆయనకు శస్త్ర చికిత్స చేయనున్నారు. తుంటి ఎముకకు స్టీల్ ప్లేట్స్ వేసే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. తుంటి బాల్ కూడా డ్యామేజ్ అయినట్లు వైద్య బృందం గుర్తించింది. కాగా హాస్పిటల్‌లో కేసీఆర్ వెంట కవిత, కేటీఆర్, హరీష్ రావు ఉన్నారు.

# రెండ్రోజులపాటు అసెంబ్లీ ప్రోటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్

హైదరాబాద్,డిసెంబర్8(మరో ఉదయం):

శనివారం నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రెండ్రోజుల పాటు ఈ సమావేశాలు జరిపించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీని నియమించింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల చేత ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించనున్నారు. కొత్త స్పీకర్ ఎన్నికయ్యేంత వరకూ అక్బరుద్దీన్ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించనున్నారు. ఇప్పటిదాకా ప్రొటెం స్పీకర్ ఎవరన్నదానిపై చర్చ జరిగింది. సీనియారిటీ ప్రకారం మాజీ సీఎం కేసీఆర్ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించాల్సి ఉంది. 8 సార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. కానీ ఇంతలోనే బాత్రూంలో కాలు జారి గాయాల పాలయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 8 వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. ఇక తర్వాత వరుసలో బీఆర్ఎస్ నుంచి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఉన్నారు. ఇక కాంగ్రెస్‌లో ఆరుసార్లు ఎన్నికైన ఎమ్మెల్యేల్లో ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు. కానీ వీరిద్దరూ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మొత్తానికి రేవంత్ సర్కార్ అక్బరుద్దీన్ ఒవైసీ వైపు మొగ్గు చూపింది.ప్రస్తుతం అసెంబ్లీలో కాంగ్రెస్ -64 సీట్లు, బీఆర్ఎస్-39 మంది, బీజేపీ-8మంది,ఎంఐఎం-7కు, సిపిఐకి ఒక సభ్యులు ఉన్నారు.

# కెటిఆర్, కవితలకు కౌంట్‌డౌన్

## మరో లేఖ విడుదల చేసిన సుఖేశ్

న్యూఢిల్లీ,డిసెంబర్8(మరో ఉదయం):



మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితకు కౌంట్ డౌన్ ప్రారంభమైందని, రూ.200 కోట్ల మనీలాండరింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సుఖేష్ చంద్రశేఖర్ మండోలి జైలు నుంచి మరో సంచలన లేఖను విడుదల చేశారు. కవిత, కేటీఆర్ అవినీతి బయటపడుతుందని తెలిపారు. వీరిద్దరూ త్వరలో జైలు క్లబ్‌లో చేరుతారన్నారు. డియర్ కేటీఆర్ బ్రదర్, కె.కవితక్క.. అసెంబ్లీ ఎన్నికల్లో మీరు సాధించిన ఫలితాలకు అభినందనలు. మీ అబద్ధాలు, అత్యాశలు, అవినీతి తెలుగు ప్రజలకు అర్థమైనట్లే మీ అహంకారం కూడా అంతమవుతుందని కొన్ని నెలల క్రితం నేను చెప్పిన విషయం గుర్తుండే ఉంటుంది. మీ గురించి తెలుసుకున్న ప్రజలు మీకు ఈ విధమైన తీర్పు ఇచ్చారు. మీరు నన్ను మోసగాడు అన్నారు. కానీ ఇవాళే మీరే మోసగాళ్లలా మిగిలిపోయారు. ఇప్పుడు మీకు, నాకు అట్టే తేడా ఏమీ లేదు. మీరు అవినీతిపరులు కాదని నిరూపించుకునేందుకు సిద్ధమవ్వండి. త్వరలోనే మీరు కూడా జైలు క్లబ్‌లో చేరుతారు. త్వరలోనే మీరంతా అమెరికాకు పయనమవుతారని భావిస్తున్నా. మీకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ దేశంలో చట్టం, సామాన్యుడి కంటే ఎవరూ శక్తివంతులు కాదు. ఫలితాల రోజు ఎక్స్‌లో తుపాకీ పట్టుకుని 3.0 అని మీరు పెట్టిన పోస్ట్ చూశాను. మీరు చెప్పిన 3.0 జైలు జీవితం త్వరలోనే ప్రారంభమవుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ అన్నకు అభినందనలు అని సుఖేష్ లేఖలో పేర్కొన్నారు.

# ప్రజాభవన్‌లో మొదలైన ప్రజాదర్బార్

## భారీగా తరలివచ్చిన ప్రజలు

## అర్జీలు స్వీకరించిన సిఎం రేవంత్

## ధరణి, భూ సమస్యలపై వినతుల వెల్లువ

## రాష్ట్రంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందన్న మోత్కుపల్లి

హైదరాబాద్,డిసెంబర్8

(మరో ఉదయం)

తెలంగాణ ముఖ్యమంత్రిగా గురువారం ప్రమాణస్వీకారం చేసిన రేవంత్ రెడ్డి దూకుడు ప్రదర్శిస్తున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు పాల్గొన్నారు. సామాన్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌కు సామాన్యులు తరలి వచ్చారు. తమ సమస్యలను వివరించారు. ధరణి సమస్యలు, తమ భూములు నేతలు కబ్జాలు చేశారని, డబుల్ బెడ్ రూంలు ఇప్పించాలని, అడ్వకేట్ రైట్స్ యాక్ట్ రూపకల్పన చేయాలని, టీచర్ 317 జీవో ఇవ్వాలని కోరారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిని కలవడానికి కొంత మంది కాంగ్రెస్ కార్యకర్తలు వచ్చారు. కాగా ప్రజాదర్బార్ కార్యక్రమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంతవాహనంలోనే జూబ్లీహిల్స్‌లోని నివాసం నుంచి ప్రజా దర్బార్‌కు చేరుకున్నారు. అనంతరం ప్రజాభవన్‌లో ప్రజాదర్బార్ మొదలైంది. సీఎం రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితర మంత్రులు పాల్గొన్నారు. ప్రజల నుంచి నేరుగా అర్జీలను సీఎం రేవంత్, మంత్రులు స్వీకరించారు. మరోవైపు ప్రజాదర్బార్‌కు మంచి స్పందన లభిస్తోంది. రాష్ట్ర నలుమూల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజాభవన్‌కు భారీగా ప్రజలు చేరుకున్నారు. తమ సమస్యలు నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్తే పరిష్కారం అవుతాయని బాధితులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధి కారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే : రాష్ట్రంలో మార్పు కనిపిస్తోందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. శుక్రవారం ప్రజాభవన్‌కు వచ్చిన ఆయన.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాదర్బార్ బాగుందన్నారు. వేలాది మంది ప్రజలు వారి సమస్యలు చెప్పుకోడానికి వస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఏ సీఎం చేయని పని



రేవంత్ చేస్తున్నారని అభినందించారు. తాను చూడ్డానికి వచ్చానని.. చాలా సంతోషంగా ఉందన్నారు. గడీలు బద్దలు కొట్టి ప్రజలు వస్తున్నారని మోత్కుపల్లి నరసింహులు పేర్కొన్నారు.

# కెసిఆర్ కోసం ఆస్పత్రికి ఎవరూ రావద్దు

## కార్యకర్తలకు హరీష్ రావు సూచన

హైదరాబాద్,డిసెంబర్8(మరో ఉదయం):



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను పరామర్శించేందుకు ఎవరూ హాస్పిటల్ రావొద్దని అభిమానులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ ఆరోగ్యం నిలకడగానే ఉందని అభిమానులు ఆందోళన చెందవద్దన్నారు. కేసీఆర్‌ను పరిశీలించిన వైద్యులు తుంటి ఎముక విరిగినట్లు గుర్తించారు. దీంతో ఐసీయూకి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కేసీఆర్‌కు హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయనున్నారు. కేసీఆర్ కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాలు పడుతుందని హరీశ్ రావు తెలిపారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాలుజారి పడటంతో ఆయనకు గాయమైన విషయం తెలిసిందే. దీంతో గురువారం అర్ధరాత్రి సోమాజిగూడలోని యశోద దవాఖానకు తరలించారు. పరిశీలించిన వైద్యులు ఎడమ కాలి తుంటి ఎముక విరిగిందని నిర్ధారించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. తుంటి ఎముక మార్పిడి చేయాలని, కోలుకోవడానికి 6 నుంచి 8 వారాలు పడుతుందని చెప్పారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని వెల్లడించారు. కాగా, దవాఖానలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదం వల్ల పెద్ద శస్త్ర చికిత్స జరుగనుంది. ఆయన త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ కుటుంబ సభ్యులతోపాటు తాము కూడా ప్రార్థిస్తున్నామని చెప్పారు. ఈమేరకు ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు.

# జగన్ అహంకారంతో విర్రవీగుతున్నాడు





## కెసిఆర్ లాగే జగన్‌కుకూడా పరాభవం తప్పదు

## తెలంగాణ ఫలితాలపై పెదవి విప్పిన చంద్రబాబు

## తుపాన్ ప్రభావిత ప్రాంతంలో పర్యటన

గుంటూరు,డిసెంబర్8

(మరో ఉదయం):

ఏపీలో జగన్ ప్రభుత్వం అహంకారంతో ఉందని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎన్నికల ఫలితాలపై తొలిసారి స్పందించారు. అహంకారంతో ఉంటే ఏమవుతుందో తెలంగాణలో చూశామని, మరో 3 నెలల్లో ఏపీలో కూడా చూస్తామని ఆయన వ్యాఖ్యానించారు. శుక్రవారం మిగ్ జాం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. నందివెలుగులో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పొలాల్లోకి దిగి స్వయంగా నీట మునిగిన పంటను పరిశీలించారు. చంద్రబాబు శుక్రవారం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తెనాలి, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల్లో ఆయన పర్యటన సాగుతోంది. ఈ సందర్భంగా తెనాలి వెళ్తూ మార్గమధ్యంలో రేవేంద్రపాడు వద్ద రైతులతో మాట్లాడారు. 'మిగ్ జాం' ప్రభావంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఇంత వరకూ పంట నష్టం అంచనాకు రాలేదని బాధిత రైతులు ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. రైతులతో మాట్లాడిన అనంతరం ఆయన నందివెలుగు వద్ద దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. తుపాను సాయం విషయంలో సీఎం జగన్ హడావుడి తప్ప ఏం లేదని చంద్రబాబు విమర్శించారు. తాను పర్యటనకు వెళ్తున్నానని తెలిసి, సీఎం హడావుడిగా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతుల కష్టాలను దగ్గరుండి తెలుసుకోవాల్సిన మంత్రులు ఎక్కడ అని ప్రశ్నించారు. 'ప్రజల కష్టాలు ఇంకా 3 నెలలే. నేను పంట నష్ట పరిహారం పెంచుకుంటూ వెళుతుంటే జగన్ తగ్గించుకుంటూ వస్తున్నారు. కనీసం పంట బీమా కూడా చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. రైతులు ధైర్యంగా ఉండాలి.' అని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు రెండు రోజుల పాటు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. అమృతలూరు, నగరం, కర్లపాలెం మండలాల్లో పర్యటన అనంతరం, రాత్రి బాపట్లలోనే బస చేయనున్న చంద్రబాబు శనివారం పర్చూరు, పత్తిపాడు నియోజకవర్గాల్లో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తారు. అనంతరం అక్కడి రైతులతో నేరుగా మాట్లాడనున్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో అరెస్టైన చంద్రబాబుకు హైకోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన కంటికి శస్త్రచికిత్స అనంతరం వారం రోజులు విశ్రాంతి తీసుకున్నారు. తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల, బెజవాడ దుర్గమ్మ ఆలయం పుణ్యక్షేత్రాలను సందర్శించారు. దాదాపు 2 నెలల అనంతరం పూర్తి స్థాయి రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ మేరకు పార్టీ వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. తుపాను కారణంగా బాధితులకు అందించే సాయంపై ప్రధానంగా కొన్ని డిమాండ్స్ ను చంద్రబాబు ప్రభుత్వం ముందుంచారు. వరి పంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.30,000, ఆక్వా రైతులకు రూ.50,000, అరటికి రూ.40,000, చెరకు పంటకు రూ.30,000, పత్తి, వేరుశనగకు రూ.25,000, జొన్న, మొక్కజొన్న, అపరాలు, పొద్దు తిరుగుడుకు రూ.15 వేలు, జీడి పంటకు రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు టీడీపీ వర్గాలు వివరాలు వెల్లడించాయి.

# ఎమ్మెల్యే కాలే యాదయ్యను సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు..

## నా గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరి కృతజ్ఞతగా ఉంటా ఎమ్మెల్యే యాదయ్య....

చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిచిన కాలయాదాయను మొయినాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండల ప్రజా పరిషత్ కార్యాలయం బయట ఆయనను కలిసి పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు.. ముచ్చటగా మూడోసారి చేవెళ్ల ప్రజలు కాల యాదయ్య మంచితనాన్ని గుర్తించి పట్టం కట్టారని నిత్యం ప్రజల కోసం పనిచేసే ఎమ్మెల్యే మనకు రావడం ఎంతో సంతోషంగా ఉందని గతంలో ఎమ్మెల్యే యాదయ్య చేసిన సేవలను గుర్తించి ఎమ్మెల్యే యాదయ్య పక్షాన నిలబడిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు కాల యాదయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ నా గెలుపు కోసం పనిచేసినటువంటి టిఆర్ఎస్ కార్యకర్తలకు చేవెళ్ల ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు నా గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మొయినాబాద్ ఎండి మహిబుబ్. సర్దార్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి రాహుఅఫ్. సురంగల్ గ్రామ టిఆర్ఎస్ నాయకులు గడ్డ మంది రెడ్డి మాజీ సర్పంచ్ మేకల రామచందర్. హౌస్ ల భాస్కర్ చారి. సురేందర్ గౌడ్ .. బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు పూసల పరమేష్.. షాబాద్ ప్రవీణ్. దేవిడ్ తదితరులు పాల్గొన్నారు




# కెసిఆర్ ఆరోగ్యంపై చంద్రబాబు, లోకేశ్, పవన్ ట్వీట్లు

అమరావతి,డిసెంబర్8(మరో ఉదయం):

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్యంపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు స్పందించారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు చంద్రబాబు ట్వీట్ చేశారు. తగిలిన గాయం త్వరగా మానాలని కోరారు. అలాగే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా కేసీఆర్ ఆరోగ్యంపై స్పందించారు. గాయం నుంచి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు నారా లోకేశ్ ట్వీట్ చేశారు. ఇక జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కూడా స్పందించారు. ఈ మేరకు పార్టీ ప్రకటన విడుదల చేసింది. "కేసీఆర్‌కు గాయమైందని తెలిసి బాధపడ్డాను. సంపూర్ణంగా కోలుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నాను. ఎన్నో సవాళ్లను అధిగమించిన ఆయనకు అనారోగ్య పరిస్థితులు మనోధైర్యంతో అధిగమిస్తారనే నమ్మకం ఉంది. పూర్తి స్వస్థత పొంది మళ్లీ ప్రజలకు, సమాజానికి తన సేవలను కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను." అని కోరారు.



SAT - M U_SAT - M U.qxd 09-12-2023 07:04 AM Page 4



మార్పు కోసం ...
మరో ఉదయం

## తారక్ ఫ్యాన్స్‌కు క్రేజీ న్యూస్.. సలార్, డంకీ సినిమాలతో రానున్న 'దేవర' టీజర్.?

టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ హీరోగా.. కొరటాల శివ దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'దేవర' ఈ చిత్రంతో శ్రీదేవి గారలపట్టి జాన్వీకపూర్ తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అవుతుంది. ఇక ఈ సినిమా రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తొలిభాగం 2024 ఏప్రిల్ 5న విడుదల కానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి తారక్ లుక్‌తో పాటు, సైఫ్ అలీఖాన్, జాన్వీకపూర్ లుక్‌లను రిలీజ్ చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమా టీజర్ ఎప్పుడు వస్తుందా ఎప్పుడెప్పుడు చూద్దామా అంటూ తారక్ ఫ్యాన్స్ వెయ్యి కండ్లతో ఎదురు చూస్తున్నారు. అయితే ఈ టీజర్‌పై ఒక సాలిడ్ న్యూస్ బయటకు వచ్చింది.దదేవర టీజర్‌ను డిసెంబర్ 25న కానీ లేదా జనవరి 1 విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియాలో టాక్ నడుస్తుంది. అయితే లేటెస్ట్‌గా దేవర టీజర్‌ని డిసెంబర్ 22న విడుదల కానున్న రెండు పాన్ ఇండియా సినిమాలు సలార్, డంకీ సినిమాలతో థియేటర్స్‌లో విడుదల చేయనున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే మాత్రం దేవరకి సాలిడ్ రీచ్ దొరికేసినట్లే. ఓవర్సీస్‌లో డంకీ సినిమాకి, ఇండియాలో సలార్ సినిమాకి సాలిడ్ బజ్ ఉంది కాబట్టి ఈ సినిమాలకి పాటు దేవర టీజర్ అటాచ్ చేస్తే బాగుంటుంది అని మేకర్స్ అలోచిస్తున్నట్లు సమాచారం. కాగా దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.






## రామ్‌చరణ్‌ను కలిసిన నెట్‌ఫ్లిక్స్ కో.సిఇఓ ఫొటోలు వైరల్

టాలీవుడ్ దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రం ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ చిత్రం భాషతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా అదరగొట్టింది. ఆడియన్స్ ను మెప్పించడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. ఎన్నో అంతర్జాతీయ అవార్డులను కొల్లగొట్టింది. అంతేకాదు, భారతీయ సినిమా ఖ్యాతిని 'ఆర్ఆర్ఆర్' చిత్రం ఆస్కార్ వేదిక వరకూ తీసుకెళ్లింది. ఈ చిత్రంలోని 'నాటు నాటు' పాట ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డును గెలుచుకుంది. అయితే ఈ చిత్రం ఆస్కార్ స్థాయిలో వెలుగులు విరజిమ్మిన నేపథ్యంలో టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఫేమ్ అంతర్జాతీయ స్థాయికి చేరింది. హాలీవుడ్ నుంచి కూడా రామ్ చరణ్‌కి ఆఫర్స్ వెల్లువలాగ వస్తూనే ఉన్నాయి. ఇదిలా ఉంటే.. తాజాగా నెట్‌ఫ్లిక్స్ కో– సీఈవో టెడ్ సరాండోస్ గురువారం హైదరాబాద్‌లో అడుగుపెట్టి నేరుగా టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నివాసానికి విచ్చేశారు. ఇక ఈ భేటీలో రామ్ చరణ్‌తో పాటు మెగాస్టార్ చిరంజీవి, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్ నిర్మాత శోభు యార్లగడ్డ తదితరులు ఉన్నారు. వీరందరితో టెడ్ సరదాగా కాసేపు ముచ్చటించారు. అనంతరం భారత్‌లో తమ తదుపరి ప్రణాళికల గురించి, వ్యాపార విస్తరణ, సినిమాలు తదితర అంశాలపై చర్చించారు. ఇక ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు.. ఈ భేటీ క్యాజువల్‌గా జరిగిందా.. ఏదైనా ప్రాజెక్టు కోసం జరిగిందా అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.





## ఆ ఒక్క డైలాగ్‌కు పడిపోయా : కియారా అద్వాణీ

ఈ ఏడాది ఫిబ్రవరిలో బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహమాడింది అగ్ర కథానాయిక కియారా అద్వాణీ. 'షేర్షా' చిత్రంలో వీరిద్దరూ కలిసి నటించారు. అక్కడే ఈ జంట మధ్య ప్రేమ చిగురించింది. అనంతరం వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఈ నేపథ్యంలో ఇటీవల 'కాఫీ విత్ కరణ్' షోలో పాల్గొన్న కియారా అద్వాణీ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. భర్త సిద్ధార్థ్ మల్హోత్రా తనకు లవ్ ప్రపోజ్ చేసిన క్షణాలను గుర్తుచేసుకుంది. ఆమె మాట్లాడుతూ 'సిద్ధార్థ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓసారి రోమ్ టూర్‌కు వెళ్లాను. అక్కడ ఓ రోజు క్యాండిల్ లైట్ డిన్నర్ చేసిన తర్వాత రోమ్ వీధుల్లో సరదాగా నడుచుకుంటూ వెళు తున్నాం. అప్పుడు ఓ వ్యక్తి మా దగ్గరకు వచ్చి వయొలిన్ ప్లే చేస్తూ పాట వినిపించాడు. వెంటనే సిద్ధార్థ్ మోకాళ్లపై కూర్చొని 'షేర్షా' సినిమాలోని 'ఢిల్లీ కా సీదా సాదా లుండా హూ' (ఢిల్లీకి చెందిన ఓ సాధారణ అబ్బాయిని) అనే డైలాగ్ చెప్పి లవ్ ప్రపోజ్ చేశాడు. ఏదో తెలియని ఆనందంలో వెంటనే ప్రేమకు అంగీకారం తెలియజేశా. మా స్నేహితుడొకరు ఈ సంఘటనను వీడియో తీశారు. నా జీవితంలో చిరకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకమది' అంటూ ఆనందం వ్యక్తం చేసింది.

## 'స్త్రీ 2' కోసం మిల్కీ బ్యూటీ స్పెషల్ సాంగ్.?



ఐదేళ్ల కిందట బాలీవుడ్‌లో 'స్త్రీ' సినిమా సృష్టించిన రికార్డులు అంతా ఇంతా కాదు. కేవలం పదిహేను కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా

రూ.180 కోట్ల రేంజ్‌లో కలెక్షన్‌లు కొల్లగొట్టింది. కామెడీ హార్రర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ సినిమా హిందీ జనాలను విపరీతంగా ఆకట్టుకుంది. రీసెంట్‌గా వచ్చిన '

భేదియా' మూవీ డైరెక్టర్ అమర్ కౌశికే స్త్రీ సినిమాను తెరకెక్కించాడు. అంతేకాకుండా ఆయనకు ఇది తొలిసినిమా. తొలి అడుగులోనే ఆ రేంజ్ హిట్ సాధించాడంటే ఆశా మాశీ కాదు. ఇక రాజ్‌కుమర్ రావు, శ్రద్ధా కపూర్ తమ తమ పర్‌ఫార్మెన్స్‌తో అదరిగొట్టేశారంతే. కీలక పాత్రలో పంకజ్ త్రిపాటి ఓ రేంజ్‌లో అవుట్ పుట్ ఇచ్చాడు. మొత్తంగా ఆ ఏడాది అత్యధిక కలెక్షన్‌లు సాధించిన సినిమాల్లో ఒకటిగా స్త్రీ నిలిచింది.ఇక ఈ బ్లాక్ బస్టర్ మూవీకి 'స్త్రీ 2' అంటూ సీక్వెల్ వస్తున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ హీరో రాజ్‌కుమార్ రావ్, శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. ఈ సినిమాకు కూడా అమర్ కౌశిక్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. అయితే ఈ సినిమా నుంచి ఒక సాలిడ్ న్యూస్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో టాలీవుడ్ స్టార్ హీరోయిన్ తమన్నా ఓ స్పెషల్ సాంగ్‌లో కనిపించనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన షూటింగ్ కూడా పూర్తయినట్లు తెలుస్తుంది. ఇక ఈ ఏడాది 'వా.. నువ్వు కావాలయ్యా' అంటూ 'జైలర్' సినిమాలో రజనీకాంత్‌తో స్టెప్పులు వేసిన తమన్నా ఈ పాటతో మరోసారి తన డ్యాన్సుతో సందడి చేయడానికి ముస్తాబవుతుంది. ఈ విషయాన్ని మేకర్స్ త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com